సాక్షి
నిజామాబాద్
శనివారం ၊ 4 ၊ మే ၊ 2024



తప్పిదాలకు చోటివ్వొద్దు
పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో తప్పిదాలకు చోటు ఇవ్వకుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.
- IIలో ▸



కుండిలో పడి చిన్నారి మృతి
మహమ్మద్‌నగర్ మండలం గాలీపూర్‌లో ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి సాయి ప్రియ నీటికుండిలో పడి మృతి చెందింది.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 43.3 /24.5
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పది కళాశాలల్లో 'గుర్తింపు' తనిఖీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలల తనిఖీలు శుక్రవారం కొనసాగాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ (వర్ని), విజయ డిగ్రీ కాలేజీ (వర్ని), బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్ఎల్ డిగ్రీ కాలేజీ, శశాంక్ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (బిచ్కుంద), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (మద్నూర్), రత్న డిగ్రీ కాలేజీ (మద్నూర్), రెయిన్‌బో డిగ్రీ కాలేజీ (జుక్కల్), ఎస్‌వీ డిగ్రీ కాలేజీ (పిట్లం)లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనల మేరకు వసతి, సౌకర్యాలు లేని కళాశాలలకు నోటీసులు అందజేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తనిఖీల్లో ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్స్ ప్రొఫెసర్ ఆరతి, ప్రొఫెసర్ లావణ్య, రాంబాబు పాల్గొన్నారు.

న్యాయమూర్తిగా శేషతల్ప సాయి నియామకం



బోధన్: బోధన్‌కు చెందిన శేషతల్ప సాయి బోధన్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టుకు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన గతంలో నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు సీఏవో (చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా పని చేసి 2020 ఆగస్టులో విరమణ పొందారు. ఆయనను నియమిస్తూ జిల్లా న్యాయమూర్తి సునీతా కుంచాల ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం బోధన్ కోర్టులో శేషతల్ప సాయి బాధ్యతలు స్వీకరించారు.

5న నీట్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్: మెడికల్ కాలేజీల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్ష ఈ నెల 5న జరగనుంది. జిల్లాలోని పది సెంటర్లలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం గంటలు 5:20 నిమిషాల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు నీట్ జిల్లా కో ఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత అనుమతించమని తెలిపారు. సందేహాలు ఉంటే 8978198421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో అర్ధరాత్రి ఉద్యోగి హల్‌చల్!

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి అర్ధరాత్రి కార్యాలయానికి రావడమే కాకుండా రాత్రి విధులు నిర్వహిస్తున్న కొందరితో గొడవకు దిగినట్లు తెలిసింది. ఎన్నికల నేపథ్యంలో కార్యాలయంలోని ఓ గదిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూం 24 గంటల పాటు పనిచేస్తుంది. సిబ్బంది పనిలో ఉండగా రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఓ ప్రధాన ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న మరో ఉద్యోగి అక్కడకు వచ్చాడు. రికార్డులను పరిశీలించబోయాడు. ఏమిటని ప్రశ్నించిన కంట్రోల్ రూం సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి, హంగామా చేసినట్లు తెలిసింది.

జోరందుకున్న పోరు!

- బూత్ స్థాయిలో శ్రమిస్తున్న పార్టీలు
- మండలాల్లో సీనియర్లు, జూనియర్లతో ప్రధాన పార్టీల కమిటీలు
- నగరం, పట్టణాల్లో డివిజన్లు, వార్డులు, గ్రామాల్లో బూత్‌ల వారీగా టీములు
- ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ ప్రాధాన్యతలను వివరిస్తున్న శ్రేణులు
- స్థానిక సమస్యలపైనా హామీలిస్తున్న నాయకులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలొస్తాయనే ఆశాభావంతో స్థానిక నాయకుల ప్రచారం

నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో మూడు ప్రధాన పార్టీల ప్రచారం ముమ్మరమైంది. మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీలు వేసుకుని పార్టీల శ్రేణులు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. తమ పార్టీల ప్రాధాన్యతలను వివరిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపుతూ తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: లోక్‌సభ ఎన్నికలకు గడువు దగ్గరపడుతున్న కొద్దీ మూడు ప్రధాన పార్టీలు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తున్నాయి. ఇంకా వారం రోజులు మాత్రమే ఎన్నికల ప్రచారాని కి సమయం ఉంది. దీంతో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు శాసనసభ సెగ్మెంట్ల పరిధిలోని అన్ని మండలాల్లో నాలుగైదు గ్రామాలకు ఒక కమిటీని, మున్సిపాలిటీల్లో వార్డులు, డివిజన్ల వారీగా కమిటీలు వేసుకుని క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. ఆయా కమిటీల్లో సీనియర్లతో పాటు జూనియర్లను సభ్యులుగా చేర్చారు. వీరంతా ప్రణాళిక ప్రకారం బూత్ స్థాయిలో అన్ని ఇళ్లను తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. తమ పార్టీ ప్రాధాన్యతలను వివరిస్తూ ముందుకు వెళుతున్నారు.

నిజాం షుగర్స్, పసుపు బోర్డు తదితర అంశాలు, గల్ఫ్, బీడీ కార్మికులు, రైతు కూలీలు, ఉపాధి కూలీల సమస్యలతో పాటు మండలాలు, గ్రామాల్లో స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారంపై నాయకులు, కార్యకర్తలు హామీలు ఇస్తున్నారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పరిధిలో సాధించే ఆధిక్యతను బట్టి స్థానిక ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని పార్టీల అగ్రనాయకులు చెప్పడంతో శ్రేణులు గట్టిగా ప్రచారం చేస్తున్నాయి. ఆధిక్యత సాధిస్తే తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు లభిస్తాయనే ఆశాభావంతో శ్రమకోర్చి ప్రచారంలో పాల్గొంటున్నారు.

■ తమ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంతో పాటు స్థానికంగా తమ ఉనికినీ చాటుకునేలా మూడు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే కొన్ని రోజుల తేడాతోనే గ్రామ పంచాయతీ సర్పంచ్, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి జూన్ ఆఖరులో లేదా జూలై ప్రారంభంలో ముగించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల కోసం పనిచేయాలని, వారి పనితీరునే ప్రామాణికంగా తీసుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవుల పోటీకి అవకాశాలు కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు స్థానికంగా వచ్చే ఓట్లకు సంబంధించి కూడికలు, తీసివేతల లెక్కలు వేసుకుంటున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో తమ గ్రామాల్లో సాధించిన ఓట్లను పరిగణనలోకి తీసుకుని ప్రచార వ్యూహాలను రూపొందించుకుని క్షేత్రస్థాయిలోకి వెళుతున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఆయా నాయకులు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లో వచ్చిన ఓట్లను బూత్‌ల వారీగా సరి చూసుకుని ప్లస్‌లు, మైనస్‌లను బేరీజు వేసుకుని ప్రచారం చేస్తున్నారు.

■ కేంద్రంలో మరోసారి అధికారాన్ని దక్కించుకునే లక్ష్యంతో బీజేపీ శ్రేణులు ఉన్నాయి. నిజామాబాద్‌లో వరుసగా రెండోసారి జెండా ఎగురవేయాలనే పట్టుదలతో కార్యకర్తలు చెమటోడుస్తున్నారు. 'మరోసారి మోదీ సర్కార్' నినాదంతో పార్టీ శ్రేణులు, అనుబంధ హిందూ సంఘాలు క్షేత్రస్థాయిలో దూకుడుగా ప్రచారం నిర్వ హిస్తున్నాయి. పట్టణాల్లో, గ్రామస్థాయిలోనూ భారీగా ఓట్లు రాబట్టుకునేందుకు బీజేపీ శ్రేణులు, యువత గట్టిగా ప్రచారం చేస్తున్నారు.

■ బీఆర్‌ఎస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ స్థానాల్లో గెలుపొందింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నెలకొన్న త్రిముఖ పోటీ తమకు కలిసొస్తుందని లెక్కలు వేసుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 6న నిజామాబాద్, 7న కామారెడ్డిలో కేసీఆర్ రోడ్‌షోలు ఉండడంతో వాటిని విజయవంతం చేసేందుకు గాను బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేస్తున్నాయి.

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ నేతృత్వంలో శుక్రవారం పూర్తిచేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1,808 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రతినిధులకు అందజేశారు. మొత్తం 1,808 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం వీవీ ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచేలా కేటాయిస్తున్నామన్నారు. ఎన్నికల్లో 29 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉందన్నారు. ఈ మేరకు రిజర్వు యూనిట్లను కలుపుకుని మొత్తంగా 4,514 బ్యాలెట్ యూనిట్లు, 2,257 కంట్రోల్ యూనిట్లు, 2,527 వీవీ ప్యాట్ యంత్రాలను కేటాయిస్తామని వివరించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో శనివారం నుంచి కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని వివరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్
ఆర్మూర్	217	542	271	303
బోధన్	246	614	307	344
నిజామాబాద్ అర్బన్	289	722	361	404
నిజామాబాద్ రూరల్	293	732	366	410
బాల్కొండ	247	616	308	345
కోరుట్ల	262	654	327	366
జగిత్యాల	254	634	317	355

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు భేష్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శరత్

సుభాష్‌నగర్: నీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలు బాగున్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి శరత్ అభినందించారు. మే నెలలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి జిల్లాలో మంచి నీటి సరఫరా పరిస్థితిపై మండల స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారని, వేసవి సీజన్ ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత @ 45.7

- సీజన్‌లో ఇదే అత్యధికం..



సుభాష్‌నగర్: ఈ వేసవిలోనే అత్యధికంగా శుక్రవారం రికార్డు స్థాయిలో జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ నార్త్ మండలంలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భగభగ మండుతున్న ఎండ దాటికి జనం ఉదయం 11 దాటిందంటే రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నగరంలోని ఖలీల్‌వాడి, బస్టాండ్, కుమార్‌గల్లీ, పూసల గల్లీ, ఇతరత్ర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. వర్నిలో 45.3, జక్రాన్‌పల్లిలో 45.0 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశముందని, వృద్ధులు, పిల్లలు బయటికి రాకపోవడమే మంచిదని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రాత్రివేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు దాటి పెరుగుతున్నాయి. జక్రాన్‌పల్లిలో ఏకంగా కనిష్ట ఉష్ణోగ్రతలు 37.5 డిగ్రీలు, కొరట్‌పల్లిలో 37.0, ముప్కాల్‌లో 36.6 డిగ్రీలుగా నమోదయ్యాయి.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

మండలం	కనిష్ట	గరిష్ట	మండలం	కనిష్ట	గరిష్ట	మండలం	కనిష్ట	గరిష్ట
			మోర్తాడ్	35.5	44.2	బెల్లాల్	34.4	43.7
నిజామాబాద్‌నార్త్	34.6	45.7	గూపన్‌పల్లి	33.5	44.2	కోరట్‌పల్లి	37.0	43.7
వర్ని	35.1	45.3	మోస్రా	34.3	44.1	ఎడపల్లి	34.7	43.6
జక్రాన్‌పల్లి	37.5	45.0	నిజామాబాద్ సౌత్	33.7	44.0	భీమ్‌గల్	35.6	43.4
ఏర్గట్ల	34.1	44.5	కమ్మర్‌పల్లి	33.3	44.0	కోటగిరి	34.6	43.2
ముప్కాల్	36.6	44.5	బోధన్	34.9	43.9	పెర్కిట్	33.8	43.1
వేల్పూర్	35.3	44.2	పోతంగల్	36.2	43.9	డిచ్‌పల్లి	35.0	43.1

ప్రారంభమైన హోం ఓటింగ్






నందిపేటలో ఓటు వేస్తున్న 102 ఏళ్ల ధనమ్మ, నగరంలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న వృద్ధులు

సుభాష్‌నగర్: ఇంటి నుంచి ఓటు సేకరించే (ఓట్ ఫ్రమ్ హోం) ప్రక్రియను నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొదటిరోజు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటు సేకరించాయని తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇళ్ల వద్దే ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటు వేసిన వారు ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని గోప్యంగా ఉంచాలని కోరారు.

కూలీల కనీస వేతనం పెంచాలి

కామారెడ్డి క్రైం: మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు అవసరమైన వివిధ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పిస్తూ.. కనీస వేతనం 300 చెల్లించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి జిల్లా ఉపాధి హామీ ప్రత్యేకాధికారి జాన్ వెస్లీ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో చందర్ నాయక్‌తో కలిసి కూలీల హాజరు శాతం, కనీస వేతనం, పని ప్రాంతాల్లో సౌకర్యాలపై ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని మండలాల్లో కూలీల హాజరు, కనీస వేతనం చాలా తక్కువగా ఉందన్నారు. రాబోయే వారం రోజుల్లోగా సమీక్షించి హాజరు శాతం, కనీస వేతనం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా పనిచేసే చోట టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

పొలిటికల్ కార్నర్ | ప్రచార పర్వం

గ్యారంటీల అమలులో విఫలం

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి



గన్నారంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

ఇందల్వాయి: ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇందల్వాయి మండలం గన్నారం, మేఘ్యా నాయక్ తండా, నల్లవెల్లి గ్రామాల్లో ఆయన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో శుక్రవారం మాట్లాడారు. గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని కోరారు. గెలవగానే పసుపు బోర్డు తెస్తానన్న ఎంపీ అర్వింద్ ఐదేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు గెజిట్ పేరిట మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎంపీపీ రమేష్‌నాయక్, జెడ్పీటీసీ సుమనరెడ్డి, వైస్ ఎంపీపీ అంజయ్య, దాస్, పులి శ్రీనివాస్, లావణ్య, సుధీర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

నిజామాబాద్‌నాగారం: ప్రజల మద్దతుతో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. వారు శుక్రవారం నగరంలో ఇంటింటి ప్రచారం చేశారు. నగరంలో అత్యధిక మెజారిటీ ఇచ్చి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఒక్క ఫ్రీ బస్సు తప్ప చేసిందీ ఏమీ లేదన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదని, కల్యాణలక్ష్మి ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు రాక, నీళ్లు లేక పొలాలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఓట్లు వేసి అబద్ధాలు చెబుతున్నారన్నారు. అర్వింద్ పసుపు బోర్డు పేరు చెప్పి మరోసారి ఓట్లు దండుకునే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. మేయర్ దండు నీతూ కిరణ్, సూదం రవిచందర్, ప్రభాకర్ రెడ్డి, సుజాత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, కరిపే రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



చేపూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పెర్కిట్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్, చేపూర్, పిప్రి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవన్ రెడ్డి ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రతియేటా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీల వేతనం రూ.400లకు పెంచుతామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశారన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, సుర్బిర్యాల్ జీవన్ రెడ్డి, జన్నెపల్లి గంగాధర్, ఇందూర్ సాయన్న, బండమీద గంగాధర్ పాల్గొన్నారు.

ఇందూరును అభివృద్ధి చేస్తా

మాక్లూర్: తనను గెలిపిస్తే ఇందూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మాణిక్‌భండార్ వద్ద చాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాక్లూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ఇందూర్ అభివృద్ధికి దూరంగా ఉండిపోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏడాది ముందు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టారని ఆరోపించారు. పసుపు బోర్డు తెచ్చానని చెబుతున్న అర్వింద్ అది ఎక్కడ పెడతారో చెప్పాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, అజార్ కిషన్‌రావు, గంగాధర్‌గౌడ్, దేగా పోశెట్టి, బూరోల్ల అశోక్, గోపాల్, నగేష్, దయాకర్‌రావు, పీర్‌సింగ్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఊసేది..?

- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ కోసం రూపొందించిన కాంగ్రెస్ మేనిఫెస్టోలో గల్ఫ్ బోర్డు, రైతు రుణమాఫీ ఊసే లేదని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎంగా కొనసాగితే రాష్ట్రంలోని ఉస్మానియా, తెలంగాణ యూనివర్శిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలను ముస్లిం యూనివర్శిటీలుగా మారుస్తారని ఆరోపించారు. గతంలో అలీఘడ్, జమియా మిల్లా యూనివర్శిటీల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం తెచ్చి తొలగించిందన్నారు. బీజేపీ ఏ రాష్ట్రంలో, ఏ యూనివర్శిటీలో రిజర్వేషన్లను తొలగించలేదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. చెరుకు ఫ్యాక్టరీల పునరుద్ధరణ పేరిట రూ.43 కోట్లు నిధులు విడుదల చేయడం పార్లమెంట్ ఎన్నికల స్టంట్ అని, కాంగ్రెస్ మరోసారి కార్మికులు, రైతులను మోసం చేయడానికి సిద్ధమైందని అర్వింద్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారని, షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించకపోగా, ఆ భూములు అమ్మకానికి, కబ్జా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలంగాణలో గల్ఫ్‌బోర్డు ఏర్పాటు చేస్తామని ఎందుకు చేర్చలేదని, గల్ఫ్ కార్మికులపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ రూ.2లక్షలు ఆగస్టు 15 వరకు చేస్తామని హామీ ఇస్తున్న సీఎం, మేనిఫెస్టోలో మాత్రం కమిషన్ వేస్తామని ప్రకటించారని ఎద్దేశా చేశారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, శంకర్, మల్లేశ్ యాదవ్, పాల్గొన్నారు.

తప్పిదాలకు చోటివ్వొద్దు

- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలి
- కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ ప్రక్రియ పరిశీలన



ఆర్డీవో కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ



సీఎంసీలో కౌంటింగ్ ఏర్పాట్లను జనరల్ అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్‌కు వివరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ

సుభాష్‌నగర్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని, తప్పిదాలకు చోటివ్వొద్దని పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమనిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు జాగ్రత్తలు సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దే ఓటరు జాబితాలోని క్రమసంఖ్య, పార్ట్ నంబర్‌ను చెక్ చేసుకోవాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారని తెలిపారు. కాగా, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రం శివారులోని సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ శుక్రవారం పరిశీలించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుతోపాటు నిజామాబాద్ అర్బన్, రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ సైతం సీఎంసీలోనే చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ అబ్జర్వర్‌కు వివరించారు. వారివెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సాకేత్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, కార్మిక శాఖ అధికారి యోహాన్, మెప్మా పీడీ రాజేందర్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆయా శాఖల అధికారులున్నారు.



పక్షులంటే ప్రాణం..

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అందె జీవన్‌రావు పక్షులను ప్రాణంగా ప్రేమిస్తున్నారు. పక్షులకు ఆవాసం కోసం తన ఇంటి ఆవరణలో రకరకాల మొక్కలను నాటి పెంచుతున్నారు. ఆ ఇళ్లు పచ్చని మొక్కలు, చెట్లు, పక్షుల కిలకిలరావాలతో నందనవనాన్ని తలపిస్తోంది. పాత హెల్మెట్లకు రంగులద్ది పక్షుల కోసం ప్రత్యేకంగా గూళ్లు తయారు చేశారు. అలాగే పారవేసిన పెయింట్ డబ్బాల మూతలు, మట్టిపాత్రలతో పక్షులకు నీరు, గింజలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గుంజీల మాస్టారుగా గుర్తింపు పొందిన జీవన్‌రావు జిల్లా ఇంటర్ విద్యాధికారిగా పని చేసిన పదవీ విరమణ పొందారు. జీవన్‌రావు ఇంటి పరసరాలు దారివెంబడి రాకపోకలుసాగించే వారిని ఆకట్టుకుంటోంది.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





క్లుప్తంగా

ఫీజు చెల్లింపు తేదీ పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలో 2011 నుంచి 2016 వరకు డిగ్రీ (వైడబ్ల్యూఎస్)లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు వన్‌టైం చాన్స్ పరీక్షల కోసం ఫీజు చెల్లింపు తేదీని ఈ నెల 9 వరకు పొడిగించినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ (ఎల్) కోర్సులకు సంబంధించి 1, 2, 3వ సంవత్సరపు బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైం చాన్స్ ఇచ్చినట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే 2016 నుంచి 2019 వరకు డిగ్రీ సీబీసీఎస్ కోర్సులకు వన్‌టైం చాన్స్ ఫీజు చెల్లింపునకు అవకాశమిచ్చినట్లు పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఈ వన్ టైం చాన్స్ ఇచ్చామని, ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 9 వరకు, అలాగే రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 10వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పరీక్షలు జూన్ నెలలో ఉంటాయని, పూర్తి వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సందర్శించాలని కంట్రోలర్ సూచించారు.

ఆకునూరి మురళికి నిరసన సెగ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ఐటీఐ గ్రౌండ్‌లో జాగో తెలంగాణ, టీఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నరేంద్రమోదీకి వ్యతిరేకంగా పాటపాడడంతో వాకర్స్ వ్యతిరేకించారు. దీంతో పాటను ఆపివేసి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. మోదీ ప్రస్తావన తీసుకురాగా వాకర్స్ మళ్లీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. టీఎస్‌డీఎఫ్ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఏ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడొద్దని సూచించారు. అరగంటపాటు వాగ్వాదం కొనసాగడంతో మురళి తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేశారు. వాకర్స్‌తోపాటు టీఎస్‌డీఎఫ్ సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

విధుల్లో చేరిన విండో కార్యదర్శి



మాక్లూర్: సొసైటీ చైర్‌పర్సన్ నిధుల దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సెలవుపై వెళ్లిన కార్యదర్శి శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు.మాక్లూర్ సొసైటీ చైర్‌పర్సన్‌గా కొనసాగిన గొప్పు లక్ష్మికి, కార్యదర్శి విష్ణువర్ధన్‌కు మధ్య నిధుల విషయంలో భేదాభిప్రాయాలు వచ్చాయి. దీంతో ఆయన లాంగ్‌లీవ్‌పై వెళ్లిపోయారు. తరువాత జరిగిన పరిణామాల తరువాత చైర్మన్‌గా బూరోళ్ల అశోక్ బాధ్యతలు స్వీకరించారు. మాక్లూర్ సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించాలని ఈనెల 2వ తేదీన సహకార సంఘాల డీఎల్‌ఈసీ కన్వీనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో విష్ణువర్ధన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ అశోక్‌తోపాటు డైరెక్టర్లు, అధికార పార్టీ నాయకులు, రైతులు ఆయనకు స్వాగతం పలికి అభినందించారు. ఇదిలా ఉండగా మాజీ చైర్‌పర్సన్ కుమారుడు రంజిత్ కొందరు అమాయక రైతులను వెంటబెట్టుకొని శుక్రవారం కలెక్టర్ వద్దకు తనపై ఫిర్యాదు చేయించారని విష్ణువర్ధన్ తెలిపారు. గొప్పు లక్ష్మి చైర్‌పర్సన్‌గా కొనసాగిన కాలంలో జరిగిన అవకతవకలు బయటపడతాయనే తనపై ఫిర్యాదులు చేయిస్తున్నారన్నారు.

మతాంతర వివాహాన్ని అడ్డుకున్న హిందూసంఘాలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో శుక్రవారం మతాతంతర వివాహం జరుగుతోందనే సమాచారం మేరకు హిందూ సంఘాల నాయకులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం నోటీసు బోర్డుపై నోటీసు ఎందుకు పెట్టలేదని బీజేపీ, బజరంగ్‌దళ్, హిందూ వాహిని నాయకులు కార్యాలయ అధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. పెళ్లి జరగనిచ్చేది లేదని స్పష్టం చేయడంతో చేసేది లేక యువతి, యువకుడితోపాటు వారి కుటుంబ సభ్యులు వెనక్కి వెళ్లిపోయారు.

బాధిత జర్నలిస్టుకు ఆర్థికసాయం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డయాబెటిక్ ప్రభావంతో కాలును కోల్పోయిన జర్నలిస్టు రాంకోటి వెంకట్‌కు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అండగా నిలిచింది. జిల్లాశాఖ యూనియన్ సభ్యులు రూ.లక్షా 50 వేల విరాళాలు సేకరించి రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల సంజీవ్, అరవింద్ బాలాజీ, జిల్లా కోశాధికారి సిరిగాద ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.ప్రమోద్‌గౌడ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పలు తండాల్లో మిషన్ భగీరథ నీటిని క్వాలిటీ కంట్రోల్ అధికారి వరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. బెజుగం చెరువుతండా, ఎర్రకుంట తండాల్లో నీటి వివరాలను అడి గి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ ఉన్నారు.

జీవన్‌రెడ్డి, అర్వింద్‌ది ఫెవికాల్ బంధం

- సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి బాజిరెడ్డి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారామ్‌యాదవ్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికారప్రతినిధి రాజారామ్‌యాదవ్

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికలబరిలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు జీవన్‌రెడ్డి, అర్వింద్‌ది ఫెవికాల్ బంధమని బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారామ్‌యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి, అర్వింద్‌ల బంధం 2019 ఎన్నికల నుంచి కొనసాగుతోందన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల తర్వాత జగిత్యాలలో నిర్వహించిన ఓ సమావేశంలో వారిద్దరూ కలిసి పాల్గొన్నారని, అర్వింద్ జీవన్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. తాను ఎంపీ కావడానికి అంకుల్(మామ) ఎంతో కష్టపడ్డారని, ఆయనకు తాను రుణపడి ఉన్నానని ప్రకటించారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో వారి మధ్య ఒప్పందం రహస్యంగా ఉందని దీన్ని ప్రజలు గమనించాలని సూచించారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే కుట్రతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తన 40 ఏళ్ల సుదీర్ఘరాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. చాలా మంది రాజకీయ ఉద్దండులను ఓడించిన వ్యక్తిగా బాజిరెడ్డి చరిత్రలో నిలిచారన్నారు. 48 గంటల విరామం తర్వాత మరింత రెట్టింపు ఉత్సాహంతో కేసీఆర్ ప్రజల్లోకి వస్తారన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌పై అక్రమంగా పెట్టిన కేసులను ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఆయనపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నుడా మాజీ చైర్మన్ సి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొత్తూరు లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, నాయకులు శంకర్, మహిపాల్‌యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మంటలు అంటుకొని రైతు మృతి



కిషన్ (ఫైల్)

సిరికొండ: వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పు పెట్టగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పోత్నూ ర్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన లాయిడి కిషన్(48)కు పోత్నూర్ శివారులో వ్యవసాయ భూమి ఉంది. తన పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు గురువారం మధ్యాహ్నం వెళ్లిన కిషన్ రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు, బంధువులు పొలం వద్ద గాలించారు.

తిరిగి శుక్రవారం ఉదయం వెళ్లి వెతకగా అక్కడ సజీవదహనమైన కిషన్ మృతదేహం కనిపించింది. కిషన్ చేతి కర్రసహాయంతో నడుస్తాడని, వరికొయ్యలకు అంటుకున్న మంటల్లో ఊపిరాడక నడవలేని స్థితిలో సజీవదహనమయ్యాడని భార్య లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు హర్షిణి, కౌశిక్ పిల్లలున్నారు.

ప్రమాదవశాత్తు ఒకరు..

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేటకు చెందిన నామాపురం శ్రీనివాస్(41) తన ఇంట్లో నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. గురువారం ఇంట్లో పని చేస్తున్న సమయంలో శ్రీనివాస్ కిందపడి మృతి చెందాడన్నారు. మృతుడి తల్లి నామాపురం నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటికుండిలో పడి చిన్నారి..



సాయిప్రియ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం గాలీపూర్ గ్రామానికి చెందిన పీట్ల గాయత్రి, సాయిబాబా దంపతుల ఏడాదిన్నర కూతురు సాయిప్రియ శుక్రవారం నీటి కుండిలో పడి మృతి చెందింది. కూలీ పనులకు వెళ్లివచ్చిన తల్లిదండ్రులు మధ్యాహ్నం వేళ ఇంట్లో ఉన్న సమయంలో సాయిప్రియ ఆడుకుంటూ వెళ్లి పక్కింటి వాకిట్లో ఉన్న నీటి కుండిలో పడి మృతి చెందింది. కూతురు కనిపించడం లేదని తల్లిదండ్రులు వెతుకుతుండగా నీటికుండిలో సాయిప్రియ కనిపించడంతో వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

పంట పొలాల్లో మంటలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ శివారులోని పంట పొలాల్లో శుక్రవారం మిట్టమధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. పంట నూర్పిడి చేసిన గడ్డి ద్వారా మంటలు ధాన్యం కొనుగోలు కేంద్రం, ఎల్లమ్మగుడి, గ్రామం వైపు వ్యాపిస్తుండగా అప్రమత్తమైన గ్రామస్తులు ఎల్లారెడ్డి, బాన్సువాడ అగ్నిమాపక శకటాలకు సమాచారం అందించారు. బాన్సువాడ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది లింగం, మోసిన్‌ఖాన్, సుధాకర్, శ్రీనివాస్, సురేశ్‌తోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ జంగం ప్రభాకర్‌ను గ్రామస్తులు అభినందించారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం అనంతరం మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా..11 మందికి రూ. 12,800 జరిమానా విధించగా,మరొకరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు.

నాలుగు టిప్పర్లు సీజ్



నందిపేట్(ఆర్మూర్): అధికలోడ్‌తో నల్లమట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఆర్టీఏ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. టాక్స్ చెల్లించకపోవడంతో డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడం, అధిక లోడ్‌తో నల్లమట్టిని తరలిస్తుండడంతో అధికారులు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ సీనియర్ అధికారి వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. తనిఖీల్లో సిబ్బంది దశరథ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో చోరీ

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నితీశ్‌కుమార్‌కు చెందిన ఆటో గురువారం రాత్రి చోరీకి గురైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో, ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి చైతన్యరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నితీశ్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఆటో నడిపి రాత్రి వేళలో ఇంటికి వెళ్తుండగా మల్కాపూర్ రోడ్డుపై చెడిపోవడంతో అక్కడే నిలిపి వెళ్లిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆటో నిలిపిన స్థలానికి వెళ్లి చూడగా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మూత్రపిండాల సంబంధిత వ్యాధితో మృతి

కామారెడ్డి టౌన్: రాజంపేట మండలం కొండాపూర్‌కు చెందిన నీరడి ఎల్లవ్వ వడ దెబ్బ కారణంగా మృతి చెందలేదని, ఆమెకు మూత్రపిండాల సంబంధిత వ్యాధి ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లవ్వ వడదెబ్బతో మృతి చెందినట్లు గురువారం మీడియాలో వార్తలు రావడంతో తాము విచారణ చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరోగ్యంగా ఉన్న ఎల్లవ్వ మేకల పెంపకం పనిలో నిమగ్నమై ఉండగా.. అకస్మాత్తుగా కుప్పకూలిందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు.

అడవి మామిడిపల్లిలో అగ్నిప్రమాదం

- ఆరు పూరిగుడిసెలు దగ్ధం
- రూ.6 లక్షల ఆస్తి నష్టం



అడవి మామిడిపల్లిలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆరు పూరిగుడిసెలు దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజిన్ గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దగ్ధమైన పూరిగుడిసెలు మాజీ సర్పంచ్ గంగోనే సంతోష్, ప్రణీత్, చిట్టెం గుణమంతు, శంకర్, శేఖర్, చిట్టెం చిన్నయ్యకు చెందినవి కాగా, అందులో ఇద్దరివి నివాసపు గుడిసెలు. మిగితా వాటిని వారివారి ఇళ్ల ఎదుట చల్లదనం కోసం నిర్మించుకొని ఫర్నిచర్‌తోపాటు ఇతర వస్తువులను భద్రపరిచారు. అగ్ని ప్రమాదంలో సామగ్రితోపాటు ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వీరన్నగుట్టలో..

రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్టకు చెందిన గుంజి రజిత అనే మహిళకు చెందిన గుడిసె షార్ట్‌సర్క్యూట్ కారణంగా శుక్రవారం దగ్ధమైంది. రజిత కూలీపనికి వెళ్లగా ఆమె కూతురు గడియపెట్టి పక్కింట్లోకి వెళ్లింది. అదే సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెకు నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు గమనించి గుడిసెలోని కొన్ని వస్తువులను బయటకు తీశారు. ఈ ఘటనలో రూ.10వేల నగదుతోపాటు దుస్తులు కాలిబూడిదయ్యాయి. రజితకు చెందిన గుడిసె దగ్ధం కావడం రెండోసారి అని, దాతలు, ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- మాల్తుమ్మెద శివారులో మూడు బైకులు ఢీ



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో శుక్రవారం మూడు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురి కాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి మెదక్ నుంచి గోపాల్‌పేట్‌కు వస్తుండగా, రాఘవపల్లికి చెందిన వ్యక్తులు మెదక్ వెళ్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అదే సమయంలో మాల్తుమ్మెద నుంచి గోపాల్‌పేట్‌వైపు వస్తున్న ఎక్సెల్ వాహనం బైక్‌లను ఢీకొట్టింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మంజీర నదిలో మహిళ మృతదేహం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీర నదిలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. ఘటనాస్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల ఉంటుందని, నలుపు రంగు చీర, నీలి రంగు జాకెట్టు ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు పిట్లం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

బోధన్‌రూరల్ : సాలురా మండల కేంద్రానికి చెందిన గైని గంగామణి (35) అనారోగ్యం కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపారు. కడుపునొప్పి బాధ భరించలేక గంగామణి బుధవారం పురుగుల మందు తాగిందన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయిందన్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి

బాన్సువాడ రూరల్: బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో బొమ్మనదేవుని శ్రీనివాస్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని శుక్రవారం తనిఖీలు చేశామన్నారు. 2.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అటవీభూమి దున్నిన ట్రాక్టర్ల పట్టివేత



మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్

రాజంపేట: మండల కేంద్రంలోని హద్దుగుండు సమీప అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా అటవీభూమిని దున్నిన రెండు ట్రాక్టర్లను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. అటవీభూమిని మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మాలోత్ లక్ష్మణ్, గౌసుద్దీన్ ట్రాక్టర్లతో దున్నారని రేంజ్ అధికారి రమేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా అడవిడిలోని చెట్లను నరికినా, భూమిని దున్నినా కేసులు నమోదు చేస్తామన్నారు. సెక్షన్ ఆఫీసర్ సయ్యద్‌బాబా, బీట్ అధికారులు మహేశ్, లచ్చయ్య, రాజమణి, దేవేందర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేట శివారులోని లొట్టివాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.